క్లుప్తంగా

1 నుంచి చేపల వేట నిషేధం

రాపూరు: కండలేరు జలాశయంలో జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు చేపల వేటను ప్రభుత్వం నిషేధిస్తున్నట్లు మత్స్యశాఖ సహాయ పరిశీలకులు సురేష్‌బాబు తెలిపారు. నిషేధిత సమయంలో మత్స్యకారులు చేపల వేటను సాగిస్తే చేపలు, వారు ఉపయోగించిన బోట్లను సీజ్ చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చేపల వేటను సాగించవద్దని కోరారు.

ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

దక్కిలి: ఉపాధి జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని దినాలు తప్పనిసరిగా కల్పించాలని ఏపీవో లక్ష్మీనారాయణ ఆదేశించారు. ఆయన శనివారం సంగనపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నాలుగు గంటలు పని చేయాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. గ్రామాల్లో అవసరమైన చోట పనులు చేసుకోవాలని తెలిపారు. అవకతవకలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలీలకు రూ.300 కూలి అందేలా పని చూపించాలని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

దక్కిలి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ తెలిపారు. మండలంలోని లింగసముద్రం ఎస్టీ కాలనీలో శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులకు సంబంధించినవే మానవ హక్కులని తెలియజేశారు. ప్రజాస్వామ్య భారతదేశంలో మనుషులు అందరూ సమానమన్నారు. గ్రామ సర్పంచ్ పీ వెంకటసుబ్బయ్య, ఎంపీటీసీ ఎన్ కోటేశ్వరరరావు, ఎంఈవో–2 పి.జగదీష్‌బాబు, ఏపీవో లక్ష్మీనారాయణ, వీఆర్వో గురుమూర్తి పాల్గొన్నారు.

మైక్ సెట్ వితరణ



పాఠశాలకు మైక్ సెట్ అందజేస్తున్న రాజనేని శ్రీనివాసులు

చిల్లకూరు : మండలంలోని పారిచెర్లవారిపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శనివారం చేడిమాల గ్రామానికి చెందిన రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు మైక్ సెట్‌ను వితరణ చేశారు. ట్రస్టు అధినేత రాజనేని శ్రీనివాసులు పాఠశాలకు మౌలిక వసతుల కల్పనలో సాయం అందిస్తామని గతంలో మాట ఇచ్చారు. ఈ క్రమంలో హెచ్‌ఎం సుధాకర్ కోరిక మేరకు రూ.20 వేల విలువైన మైక్ సెట్‌ను జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ చేతుల మీదుగా అందజేశారు. డీఈవో శేఖర్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ట్రస్టు ప్రతినిధులు రామానాయుడు, బాబు పాల్గొన్నారు.

లాసెట్‌లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని వర్షినిని అభినందిస్తున్న కౌన్సిలర్ నారాయణ

వెంకటగిరి రూరల్ : ఏపీ లా సెట్ ఫలితాల్లో వెంకటగిరి పట్టణంలోని 4వ వార్డు సాలికాలనీకి చెందిన జింకా వర్షిని రాష్ట్ర స్థాయిలో 45వ ర్యాంకు సాధించింది. ఆమెను కౌన్సిలర్ ఎంఏ నారాయణ అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

వెంకటగిరి(సైదాపురం) : పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణంలో శనివారం శ్రీనివాసన్ సేవా సంస్థ, తిరుపతిలోని ఎస్వీ అరవింద కంటి వైద్యశాల సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి వైద్యులు రవితేజ, కృష్ణవంశీ, జీవన్‌రావు 226 మందికి కంటి పరీక్షలు చేశారు. 60 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. 16 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో శ్రీనివాసన్ సేవా సంస్థ వీడీవో కేశవులు, అలేఖ్య, పార్థు, సురేష్, సాయి, చరణ్ పాల్గొన్నారు.

కనుల పండువలా శ్రీవారి కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



స్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో కొలువుదీర్చి వివిధ రకాల ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య కల్యాణం చేశారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ చేపట్టారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

అక్షర మాలతో క్రికెట్ జట్టుకు ఆల్ ద బెస్ట్



ఆల్ ద బెస్ట్ రూపంలో విద్యార్థులు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని నెలటూరు సమీపంలో ఉన్న ఆదిశంకర ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు శనివారం ఆల్ ద బెస్ట్ అన్న రూపంలో ఏర్పడి క్రికెట్ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ రూపవతి మాట్లాడుతూ టీ–20 వరల్డ్ కప్పు ఫైనల్ పోటీలు శనివారం జరుగుతున్న క్రమంలో ఇండియా జట్టు సౌత్ ఆఫ్రికాతో పోటీ పడిందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 140 కోట్ల భారతీయుల కలను నెరవేర్చాలని కోరుతూ విద్యార్థులు ఆల్ ద బెస్ట్ అని అక్షర మాలగా ఏర్పడ్డారని చెప్పారు. టీమ్ ఇండియా జట్టులోని ప్రతి సభ్యుడికీ శుభాకాంక్షలు తెలిజేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఈటీ మనోహర్, ఉపాధ్యాయులు మల్లికార్జున్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేశవులుకు ఘన నివాళి



కేశవులు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు

కలువాయి: బలిమెల రిజర్వాయర్ వద్ద 16 ఏళ్ల క్రితం మావోయిస్టుల కాల్పుల్లో మృతిచెందిన కలువాయికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ అనకర్ల కేశవులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం 16వ వర్ధంతిని పురస్కరించుకుని కలువాయి బస్టాండ్‌లోని అమర వీరుల స్థూపం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ అయ్యప్ప, కేశవులు తల్లిదండ్రులు పెంచలమ్మ, చెన్నయ్య, కేశవులు సోదరి శ్రీదేవి, సీఆర్పీ నాగేశ్వరరావు, గోపాల్ తదితరులు హాజరై కేశవులు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీఎల్‌పీవో రవీంద్ర తెలిపారు. ఆయన శనివారం ఓజిలి ఎస్సీ కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించాలన్నారు. రహదారులపై మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. ఓజిలి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సిరాజ్‌బాషా, ఏఎన్‌ఎం చందన తదితరులు ఉన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమాండింగ్ ఆఫీసర్లు నరేంద్రబాబు, మల్లికార్జునరెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో వారం రోజులుగా జరుగుతున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణా శిబిరం శనివారం ముగిసింది. శిక్షణలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 639 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. వారికి యోగా, స్పోర్ట్స్, కల్చరల్, నావెల్ ఓరియెంటేషన్, ఫైర్ ఫైటింగ్, రిగ్గింగ్ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. అదేవిధంగా శారీరక ధృఢత్వం, సామాజిక సేవ, క్రమశిక్షణ వంటి వాటిపై అవగాహన కల్పించారు. విజేతలకు కమాండింగ్ ఆఫీసర్లు నరేంద్రబాబు, మల్లికార్జునరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాగరాజు, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ, సుస్మిత, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్..

దొరవారిసత్రం : మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. ×వ్యాధులు కాలం జాగ్రత్తలు అవసరం₹ అనే శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై ఆయా గ్రామ సచివాయాల కార్యదర్శులు, వైద్య సిబ్బంది స్పందించారు. నీటి నిల్వలను తొలగించారు. చేతి బోర్లు, వీధి కొళాయిల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశారు. గ్రామాల్లోని ప్రజలకు అంటురోగాలపై అవగాహన కల్పించారు.

వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఏపీ హంస వెంకటగిరి తాలూకా కార్యవర్గం

వెంకటగిరి రూరల్ : వైద్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉమ్మడి నెల్లూరు జిల్లా తాలూకా హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని బంగారుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం వైద్య ఉద్యోగులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వైద్య విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు హంస ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ద్వారా అందాల్సిన హక్కులను పరిరక్షించడంతోపాటు సమస్యల పరిష్కారం దిశగా ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ కమల్ కిరణ్, ట్రెజరర్ ఎండీ మంజురుల్లా, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, నాయుడుపేట తాలూకా సెక్రటరీ సుభాషిణి, నెల్లూరు తాలూకా వైస్ ప్రెసిడెంట్ పి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి తాలూకా కార్యవర్గం ఎంపిక

ఏపీ హంస వెంకటగిరి తాలూకా నూతన కార్యవర్గాన్ని వర్గం జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ రావు, జనరల్ సెక్రటరీ కమల్ కిరణ్ సమక్షంలో ఎన్నుకున్నారు. వెంకటగిరి తాలూకా ప్రెసిడెంట్‌గా పి.రాజేశ్వరి, సుబ్బలక్ష్మి, సెక్రటరీగా ఏ శీనయ్య, ట్రెజరర్‌గా పి సుశీల, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సిద్దారెడ్డి, పబ్లిసిటీ సెక్రటరీగా ప్రసన్న, వైస్ ప్రెసిడెంట్లుగా మల్లెమ్మ, మునీంద్ర, వీరయ్య, మునిరాజ, శైలజ, మహిళా వింగ్ సెక్రటరీలుగా ఇంద్రాని, వెంకటరమణమ్మ, మేరీ లావణ్య, దేవమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థినికి స్కూల్ కిట్ ఇస్తున్న డీఈఓ శేఖర్

గూడూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే ప్రతి విద్యార్థికీ పూర్తి స్థాయిలో విద్యా సామగ్రి కిట్లను అందజేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి శేఖర్ తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినులకు స్కూల్ కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 తరగతి వరకు చదువుతున్న పిల్లలకు కిట్లు వచ్చాయని, అందరికీ అందజేస్తున్నట్టు వివరించారు. అనంతరం పాఠశాలలో మౌలిక వసతులపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఈవో ఎం శాంతి, స్టూడెంట్ కిట్ డైరెక్టర్ మస్తానయ్య, ఎంఈవోలు సనత్‌కుమార్, ఎండీ రవూఫ్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 110 కేసుల పరిష్కారం



కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి సంయుక్త



గూడూరు రూరల్ : మాట్లాడుతున్న జడ్జి సులోచనరాణి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్‌లో 110 కేసులను పరిష్కరించినట్టు జడ్జి సంయుక్త తెలిపారు. వాటిలో 103 క్రిమినల్, 3 సివిల్, 3 చెక్ బౌన్స్, ఒక భరణం కేసులు ఉన్నట్టు తెలిపారు. కేసుల పరిష్కారానికి కృషి చేసిన పోలీసు అధికారులు, న్యాయవాదులు, జడ్జికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు పసల గంగాప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. ఏపీపీ స్వాతి రెడ్డి, బార్ అసోసియేషన్ కార్యదర్శి వీరస్వామి, ప్రభుత్వ న్యాయవాది హరినాథ్‌రెడ్డి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వెందోటి పార్థసారథిరెడ్డి, కిషోర్, సీనియర్ న్యాయవాదులు దశయ్య మొదలియార్, పసల చెంగయ్య, రఫీ, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన కక్షిదారులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు రూరల్ : రాజీ పడగలిన ప్రతి కేసునూ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జీవించాలని గూడూరు సివిల్ కోర్టు జడ్జి సులోచనారాణి తెలిపారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు వ్యాపారలావాదేవీలు, భార్యా భర్తల కేసులను పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ కక్షిదారులకు సత్వర న్యాయం జరగాలంటే అదాలత్ ద్వారా ఇరువర్గాల వారు రాజీ చేసుకుని కేసులు లేకుండా చేసుకోవచ్చని అన్నారు. దీనిని గుర్తించి ప్రతి ఒక్కరూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి లోక్‌నాథం, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కోటమ్మ ఉత్సవాలు



పూల బుట్టలు తీసుకువస్తున్న మహిళలు

కోట: గ్రామదేవత కోటమ్మ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సముద్ర జలాలతో అమ్మవారిని అభిషేకించారు. సారె సమర్పించే కార్యక్రమంలో వందలాది మహిళలు పాల్గొన్నారు. మహిళలు పూల బుట్టలతో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి నివాసం నుంచి ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం అక్కడ అమ్మవారికి పూలాభిషేకం చేశారు. తొలిరోజు కార్యక్రమాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ



డివైడర్‌పై బోల్తా పడిన కారు

చిల్లకూరు : మండలంలోని చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై కోట క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం ముందు వెళుతున్న కారును లారీ ఢీకొంది. దీంతో కారు డివైడర్‌పై బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎవరికీ గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. చేజర్ల మండలం సోమశిలకు చెందిన రవీంద్ర నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి నాయుడుపేటకు వెళ్లారు. తిరిగి నెల్లూరు బయలుదేరారు. కోట క్రాస్ రోడ్డు వద్ద అదే మార్గంలో వస్తున్న లారీ ఢీకొది. దీంతో కారు డివైడర్‌పై బోల్తా పడింది. కారులోని వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు కారు డోర్‌లు తెరిచే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు క్రేన్‌ను తీసుకుని వచ్చి కారును పైకి లేపి డోర్‌లు తెరిచారు. అందులోని వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

నాయుడుపేట టౌన్ : ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించపోతే చర్యలు తప్పవని ఎంఈవోలు శాంతి, మునిరత్నం హెచ్చరించారు. వారు శనివా రం ఎమ్మార్సీలో యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. పాఠశాల నోటీస్ బోర్డులో తరగతుల వారిగా ఫీజుల వివరాలు తెలియజేయాలన్నారు.

శేషురెడ్డికి మాతృ వియోగం



ఈశ్వరమ్మ(ఫైల్)

చిట్టమూరు (చిల్లకూరు): వైఎస్సార్ సీపీ నాయకుడు దువ్వూరు శేషురెడ్డి తల్లి ఈశ్వరమ్మ(80) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విష యం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేతలు ఆయనను పరామర్శించారు. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎంపీ విజయసాయి రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి ఫోన్‌లో పరామర్శించారు.

వైఎస్సార్ సీపీకి దువ్వూరు రాజీనామా

దొరవారిసత్రం : వ్యక్తిగత కారణాలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్టు దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. తన రాజీనామా లేఖను శనివారం పార్టీ అధ్యక్షుడికి పంపినట్టు పేర్కొన్నారు. ఇన్నేళ్లు పార్టీకి, ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వసతి గృహం పరిశీలన

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణం క్రాస్ రోడ్డు సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలతోనే బియ్యం పంపిణీ

నాయుడుపేట టౌన్ : తెల్లరేషన్ రేషన్ కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారానే రేషన్ బియ్యం అందజేయాలని తహసీల్దారు లావణ్య తెలిపారు. ఆమె శనివారం రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ చక్కెర, కందిపప్పు ప్యాకెట్లలో తూకం తక్కువ ఉన్నట్లు గుర్తించారని, వాటిని ఇవ్వవద్దన్నారు. ఆగస్టు నెలలో రేషన్ పంపిణీపై ప్రభుత్వం ఉత్తర్వులిస్తుందన్నారు. రేషన్ బియ్యం తూకం తక్కువగా ఇస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీటీ రాజేంద్ర పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తేనే ఉద్యోగులకు గుర్తింపు



నౌషాద్‌ను సత్కరిస్తున్న ఆర్డీవో, తదితరులు



ఎస్‌ఐని సత్కరిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

గూడూరు రూరల్ : ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారంలో బాధ్యతగా పనిచేసిన ఉద్యోగులకు తప్పక గుర్తింపు లభిస్తుందని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్న ఎస్‌డీ నౌషాద్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.

ఉద్యోగికి క్రమశిక్షణ అవసరం

క్రమ శిక్షణ, పేదలకు న్యాయం చేయాలనే మనస్సు ఉన్నప్పుడే పోలీసులకు గుర్తింపు ఉంటుందని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించిన క్రమంలో గూడూరు డివిజన్‌లోని పోలీసులతో శుక్రవారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉద్యోగ విరమణ చేస్తున్న ఒకటో పట్టణ ఎస్‌ఐ కృష్ణమూర్తిని సత్కరించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

దొరవారిసత్రం: దొరవారిసత్రం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పి.దామోదరం ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనను శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఇతర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

కలువాయిలో..

కలువాయి: మండలంలోని పెన్నబద్దెవోలు ఎంపీయూపీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తూ ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్న చింతంరెడ్డి వెంకటరెడ్డిని శనివారం జెడ్పీటీసీ బి.అనీల్‌కుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం వల్లూరు కృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వాకాడులో..

వాకాడు: దుగ్గరాజపట్నం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు ముమ్మడి వెంకటసుబ్బయ్య ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయనను శనివారం ఘనంగా సన్మానించారు. అనంతరం పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులు నగదు బహుమతి అందజేశారు. ఎంఈవో నసీం అలీ, కోట, చిట్టమూరు ఎంఈవోలు మస్తానయ్య, బీవీ కృష్ణయ్య, హెచ్‌ఎంలు వెంకయ్య, పి ప్రవీణ్‌కుమార్, నాగయ్య, భూపయ్య, నాగమణెమ్మ పాల్గొన్నారు.



టీచర్ దామోదరంతో విద్యార్థులు, గ్రామస్తులు



సాయికృష్ణను సన్మానిస్తున్న అధికారులు

సాయికృష్ణ సేవలు ప్రశంసనీయం

రాపూరు: మండలంలోని ఆకలివలస అటవీబీట్ అధికారిగా పనిచేస్తున్న సాయికృష్ణ సేవలు ప్రశంసనీయమని అటవీశాఖ రేంజర్ రవీంద్ర బాబు తెలిపారు. సాయికృష్ణ ఆదివారం ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో శనివారం స్థానిక ఫారెస్టు క్వార్టర్స్‌లో సాయికృష్ణను ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ 34 సంవత్సరాలు ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా ఆయన సేవలు అందించారని కొనియాడారు.